క్లుప్తంగా

ఉపాధి కూలీల సంఖ్య పెంచండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ సాంబశివరావు

ఉయ్యాలవాడ : ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని ఏపీడీ సాంబశివరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల పరిధిలో రోజు వారి కూలీల సంఖ్య 1,500 లక్ష్యం కాగా ప్రస్తుతం 250లోపు ఉన్నారని సిబ్బంది పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 20 గ్రామ పంచాయతీల పరిధిలో 5 మంది టెక్నికల్ అసిస్టెంట్లు ఉన్నారని, వ్యవసాయ కూలీలు ఉపాధి పనుల్లో పాల్గొనేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఏపీఓ రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అన్సర్ జ్యువెలరీ లక్కీడ్రా విన్నర్‌గా మహమ్మద్‌రఫీ



కారును బహుమతిగా అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): స్థానిక అన్సర్ జ్యువెలరీ ఆధ్వర్యంలో గ్రాండ్ డైమండ్ ఎగ్జిబిషన్‌లో భాగంగా శుక్రవారం నిర్వహించిన లక్కీ డ్రాలో విన్నర్‌గా ఫరూక్‌నగర్‌కు చెందిన మహమ్మద్ రఫీ నిలిచారు. నిర్వాహకులు అన్సర్, అమీర్, రాజగోపాల్‌రెడ్డి, చలంబాబుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ఫరూక్ చేతుల మీదుగా విన్నర్‌కు కారును బహుమతిగా అందజేశారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

శిరివెళ్ల: కోటపాడు గ్రామ పంచాయతీలో శుక్రవారం ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప పర్యటించారు. ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. భోజన నాణ్యతను పరిశీలించి నిర్వాహకురాలుకు సూచనలు చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తదనంతరం గ్రామ సచివాలయాన్ని పరిశీలించి సిబ్బంది హాజరు, సేవల తీరును పంచాయతీ కార్యదర్శి మనోహర్‌ను అడిగి ఎంపీడీఓ తెలుసుకున్నారు.

ఘనంగా ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం

నంద్యాల(న్యూటౌన్): దేశ స్వాతంత్ర్య పోరాటంలో ముందుండి పోరాడిన ఏకైక కార్మిక సంఘం ఏఐటీయూసీ అని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ అన్నారు. ఏఐటీయూసీ 105వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సీపీఐ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ మాట్లాడుతూ బొంబాయి నగరంలో 1920లో స్వాతంత్ర్య సమరయోధులు లాలా జలపతిరాయ్ అధ్యక్షతన ఏఐటీయూసీ ఆవిర్భవించిందన్నారు. కార్యక్రమంలో సోమన్న, శ్రీనివాసులు, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

రాష్ట్రావతరణ దినోత్సవం

చాగలమర్రి: మండల కేంద్రం చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణ దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి హెచ్‌ఎం ఐడీకే శాస్త్రి, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బసవన్నలకు ప్రత్యేక పూజలు

నంద్యాల(వ్యవసాయం) : నంద్యాలలో కార్తీక మాసం మొదటి రోజును పురస్కరించుకొని మన ఊరు-మన గుడి వారి ఆధ్వర్యంలో కాంత్రినగర్‌లో శుక్రవారం బసవన్నలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు శివకుమార్‌రెడ్డి, మహానంది దేవాస్థానం ప్రధాన అర్చకులు శ్రీ రవిశంకర అవధాని మాట్లాడుతూ రైతులు ఆనందంగా సుఖసంతోషాలతో ఉండాలంటే కార్తీక మాసంలో ఎద్దులకు ప్రత్యేక పూజలు నిర్వహించాలన్నారు. రాయలసీమ సాగు నీటి సంఘం అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి, వైఎస్ రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి పాల్గొన్నారు.

వరి పైరుపై గడ్డి మందు పిచికారీ



దెబ్బతిన్న వరి పైరు

రుద్రవరం: మండల పరిధిలోని శ్రీరంగాపురం వద్ద సర్వుడు అనే రైతు సాగు చేసిన వరి పంటపై గుర్తు తెలియని దుండగులు గురువారం గడ్డి మందు పిచికారీ చేశారు. దీంతో పంట బాగా దెబ్బతింది. రెండెకరాల్లో సాగుచేసిన పంట ప్రస్తుతం పంట కీలక దశలో ఉంది. మంచి దిగుబడులు వస్తాయి లాభాలు గడిస్తామన్న ఆశలతో ఉన్న సమయంలో ఓర్వ లేని వారు పంటపై గడ్డి మందు పిచికారీ చేశారని బాధితుడు వాపోయాడు. పెట్టుబడులకు రూ.40 ఖర్చు చేశానని విలపించాడు. ఈ విషయంపై రుద్రవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

పత్తిరైతు చిత్తు !



• ఈ చిత్రంలో పత్తి మొక్కను చూపుతున్న రైతుపేరు అస్లాంబాషా. ఈయన దొర్నిపాడులో ఎకరాకు రూ.40వేలు కౌలు చెల్లించి 8 ఎకరాల్లో సీడ్ పత్తిని సాగుచేశాడు. భారీ వర్షాల కారణంగా క్రాసింగ్ చేశాక నిలబడిన కాయలన్నీ నేల రాలాయి. ఒక్కో చెట్టుకు 30 కాయలు కూడా లేవు. లేదంటే ఈపాటికి ప్రతి చెట్టుకు 80 వరకు ఉండాల్సిందని వాపోతున్నాడు. ఎకరానికి 8 క్వింటాళ్ల పత్తి గింజలు వస్తే గానీ గట్టెక్కే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



• ఈ రైతుపేరు శ్రీకాంత్. ఈయన దొర్నిపాడులో 30 ఎకరాల్లో సీడ్ పత్తిని సాగు చేశాడు. ప్రస్తుతం చెట్టుకు 25 కాయలు ఉన్నట్లు చూపుతున్నాడు. ఈ నెలాఖరు వరకు క్రాసింగ్ పనులు చేయించేందుకు సిద్ధంగా ఉన్నాడు. కనీసం 50 కాయలు నిలబడినా పెట్టుబడులు వస్తాయని ఆశిస్తున్నాడు. లేదంటే పెద్ద నష్టాలు చవిచూడాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నాడు రైతు శ్రీకాంత్.

- అన్నదాతను ముంచిన భారీ వర్షాలు
- చెట్టుకు 30 కాయలు మించని వైనం
- ఆందోళన చెందుతున్న రైతులు
- ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 2,624 హెక్టార్లలో సీడ్ పత్తి సాగు



పత్తిలో క్రాసింగ్ పనులు చేస్తున్న కూలీలు

దొర్నిపాడు: వర్షాభావ పరిస్థితులు రైతులను వెంటాడుతూనే ఉన్నాయి. దీంతో తీవ్రంగా నష్టపోతూనే ఉన్నారు. ప్రత్యేకించి ఈఏడు పత్తిరైతు చిత్తవుతున్నాడు. కాలయలులేని పత్తి చెట్లను చూసి రైతుల గుండెలు గుభేల్ మంటున్నాయి. గతేడాది సిరులు కురిపించిన పత్తి ఈ ఏడాది పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కానరావడం లేదు. ప్రకృతి ప్రకోపానికి సీడ్ పత్తి రైతులు గగ్గోలు పెడుతున్నారు. సీడ్ పత్తి క్రాసింగ్ పనులు మొదలైన రెండు వారాలకు వరుణుడు వెంటాడాడు. వర్షాలు వరసపెట్టి కురవడంతో ఉన్న పత్తి కాయలన్నీ నేలరాలిపోయాయి. పంట చేతికి వస్తుందా? రాదా? అనే భయం వెంటాడుతుంది. దిగుబడులు పూర్తిగా తగ్గిపోయే ప్రమాదం ఉండటంతో ఉన్న ఆశలు ఆవిరై కంట కన్నీళ్లు రాలే పరిస్థితులు తలెత్తాయి. చెట్టుకు 60 కాయలు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 30 లోపే ఉండడంతో ఆందోళన చెందుతున్నాడు అన్నదాత.

భారీ పెట్టుబడులు

పత్తి విత్తనప్పటి నుంచి చేతికి వచ్చేవరకు రైతులు భారీగా పెట్టుబడులు పెట్టిస్తారు. కౌలు రైతుల పరిస్థితి మరీ అధ్వానం. ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.60వేలు కౌలు చెల్లించాల్సి ఉంటుంది. సీడ్ క్రాసింగ్ 60 రోజుల నుంచి 75 రోజుల వరకు చేయిస్తారు. ఇందు కోసం ఎకరానికి రూ.2.50లక్షల వరకు కూలీలకు కూలి చెల్లిస్తారు. అలాగే రసాయ ఎరువులు, నీళ్ల మందులు ఇలా సుమారు రూ.50వేలకు పైగా ఖర్చులు వస్తాయి. అంటే ఒక ఎకరం సీడ్ పత్తి సాగుచేయాలంటే రూ.3.50లక్షలకు పైగా పెట్టుబడులు వస్తాయి. ప్రస్తుతం క్వింటాం సీడ్ పత్తి విత్తనాలు రూ.60వేల వరకు ఉంది. ఇంత ఖర్చు చేశాకా దిగుబడులు రాకుంటే రైతులు అప్పులు మూటగట్టుకోవాల్సిందే.

8 నుంచి 10 క్వింటాళ్ల పత్తి విత్తనాలు వస్తేనే గట్టెక్కినట్టు..

ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల పత్తి విత్తనాలు వస్తేగాని గట్టెక్కె పరిస్థితి లేదు. అంటే ప్రతి మొక్కకు 70 నుంచి 80 కాయలు ఉంటే తప్పా రైతులు అనుకున్న దిగుబడులు రావు. ప్రస్తుతం మొక్కకు 30 కాయలకు మించి లేవు. పత్తిలో కాయలు నిలబడేందుకు అక్టోబర్ నెల కీలకం. సెప్టెంబర్ చివరి వారం నుంచి క్రాసింగ్ పనులు మొదలవుతాయి. అక్టోబర్‌లో క్రాసింగ్ చేసిన కాయలన్నీ నిలబడాల్సి ఉంది. కానీ అధిక వర్షాలు కారణంగా అన్నీ నేలరాలిపోయాయి. నవంబరులో మంచు కారణంగా కాయలు నిలబడవు. అంటే మంచి అదును అయిన అక్టోబర్ నెలలోనే రైతుల కొంపముంచింది వర్షం. దీంతో ఎకరానికి 5నుంచి 6 క్వింటాళ్ల కంటే దిగుబడులు వచ్చే పరిస్థితి లేదు.

నియోజకవర్గంలో సీడ్ పత్తి సాగు వివరాలు

మండలం	సాధారణ సీడ్‌పత్తి సాగు (హెక్టార్స్‌లో)	ప్రస్తుతం సాగైన సీడ్‌పత్తి
ఆళ్లగడ్డ	755	574
చాగలమర్రి	487	175
దొర్నిపాడు	1,065	1,022
రుద్రవరం	299	290
శిరివెళ్ల	157	23
ఉయ్యాలవాడ	632	540
మొత్తం సాగు	3,395	2,624

వాతావరణం చాలా ముఖ్యం

సీడ్‌పత్తి సాగుకు వాతావరణం చాలా ముఖ్యం. వర్షాలు అధికమైనా చెట్టుకున్న పింజలన్నీ నేలరాలుతాయి. ఈ ఏడాది భారీ వర్షాలు కురవడంతో పాటు పొలాల్లో ఏమాత్రం తేమశాతం తగ్గలేదు. అందుకు కాయలు నిలబడలేదని తెలుస్తోంది. నబంబరులో మంచు తక్కువగా ఉంటే కాయలు నిలబడే అవకాశం ఉంది. క్రాసింగ్ పనులకు ఈ నెలాఖరు వరకు సమయం ఉంది. రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదు.

–చంద్రశేఖర్‌రెడ్డి, ఏఓ, దొర్నిపాడు

మొదటి నుంచి ఇబ్బందులే



నేను ఈ ఏడాది 4.50 ఎకరాల్లో సీడ్ పత్తిని సాగుచేశా. పత్తి మొలకెత్తినప్పటీ నుంచి కష్టాలు వెంటాడుతున్నాయి. మొదట్లో క్రాసింగ్‌కు మగ పూలురాక ఇబ్బందులు పడ్డా. అధిక వర్షాల కారణంగా మగపూల ఉత్పత్తి పూర్తిగా తగ్గిపోయింది. దీంతో చాలా ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం కాయలు పూర్తిగా తగ్గిపోయాయి. ఇక చలి మొదలైతే మంచు కారణంగా పూర్తిగా కాయలు నేలరాలే పరిస్థితులు ఉంటాయి.

– రమేష్, బుర్రారెడ్డిపల్లె

నష్టాలు మూటగట్టుకోవాల్సిందేనేమో...



గతేడాది వర్షాభావ పరిస్థితులు ఎదురైనా పత్తిలో మంచి దిగుబడులు వచ్చాయి. ప్రస్తుతం భారీ వర్షాల కారణంగా నష్టాలను మూటగట్టుకోవాల్సి వస్తుందేమో. ఈపాటికి ప్రతి చెట్టుకు కనీసం 60 కాయల వరకు ఉండాలి. కనీసం 30 కాయలు కూడా కనిపించడం లేదు. దిబడులు పూర్తిగా తగ్గిపోయే అవకాశం ఉంది.

– ప్రసాద్, బుర్రారెడ్డిపల్లె

దేశ భక్తే పటేల్‌కు నిజమైన నివాళి



మాట్లాడుతున్న రిటైర్డు జడ్జి శివప్రసాద్

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులకు దేశభక్తి, దృఢ సంకల్పం లక్ష్యం ఉన్నప్పుడే సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు నిజమైన నివాళి అని రిటైర్డు జిల్లా జడ్జి కాశిబట్ల శివప్రసాద్ అన్నారు. నంద్యాల పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో సర్దార్‌వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన జిల్లా జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు సర్దార్‌వల్లభాయ్ పటేల్ ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. నిరంతరం దేశం కోసం తపించారని, దేశ ఐక్యత కోసం విద్యార్థులు ఆలోచించినప్పుడే నిజమైన స్ఫూర్తినిచ్చిన వారవుతారన్నారు. అనంతరం పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సర్దార్ వల్లభాయ్ పటేజ్ జీవిత విశేషాలు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ రామకృష్ణారెడ్డి, ప్రగతిరెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్లు లలితాసరస్వతి, కమాల్‌ఖాన్, లక్ష్మీదుర్గా, విద్యార్థులు పాల్గొన్నారు.

వసతులు కల్పించడంలో విఫలం



రోడ్డుపై నిలిచిన నీటిలో నిలబడి నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణ సమీపంలోని నందమూరినగర్‌లో మౌలిక వసతులు కల్పించడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు విఫలమయ్యారని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ అన్నారు. శుక్రవారం నందమూరినగర్‌లోని నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ రోడ్డుపై నిలిచిన నీళ్లలో నడుచుకుంటూ నిరసన తెలిపారు. 40 సంవత్సరాల క్రితం నందమూరినగర్ ఏర్పడిందన్నారు. సరైన రోడ్లు లేక కాలనీ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. చిన్నపాటి వర్షానికే నీరు నిల్వ ఉండి దోమలకు, విష పురుగులకు నిలయంగా మారాయన్నారు. న్యాయశాఖ మంత్రి, అధికారుల ఈ ప్రాంతంపై దృష్టి పెట్టి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు హుసేన్‌సా, రహిమాన్, బాషా, మాబాషా, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం



సుధాకర్(ఫైల్)



టీజీపీ ప్రధాన కాల్వలో బోటులో వెళ్తున్న పోలీసులు

రుద్రవరం: మండల పరిధిలోని అప్పనపల్లె వద్ద టీజీపీ 19వ బ్లాక్ ఉప ప్రధాన కాల్వలో శుక్రవారం యువకుడి మృత దేహం లభ్యమయ్యింది. ఆ మృత దేహాన్ని పరిశీలించిన పోలీసులు శిరివెళ్ల మండలం మహదేవపురం గ్రామానికి చెందిన సుధాకర్(22)గా గుర్తించారు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల మేరకు మహదేవపురం గ్రామానికి చెందిన సుధాకర్ మరి కొంత మంది యువకులతో కలిసి పత్తి పొలాల్లో కూలీ పనులు చేసేవాడు. అక్టోబర్ 27న కూలీ పనులకు వెళ్లక ఇంటి వద్దే ఉన్నాడు. అయితే మధ్యాహ్నం అటుగా వెళ్లొద్దాం రమ్మని తోటి కూలీలు ఆ యువకుడిని మోటర్ సైకిల్‌పై గాజులపల్లె-బుక్కాపురం వైపు తీసుకెళ్లారు. సాయంత్రం బయటకు వెళ్లిన కూలీలందరూ ఇంటికి వచ్చినా సుధాకర్ రాలేదు. కుటుంబ సభ్యులు తోటి కూలీలను విచారించగా వచ్చేటప్పుడు తెలుగుగంగ కాల్వలో దూకాడని చెప్పారు. వెంటనే వారు టీజీపీ ప్రధాన కాల్వ వెంట ఆచూకీ కోసం గాలించారు. అయినా ఫలితం లేక పోవడంతో మహానంది పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న మహానంది ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి కాల్వ వెంట గాలించారు. శుక్రవారం బోటులో కాల్వ వెంట వెళ్తూ రుద్రవరానికి సమీపాన ఉన్న గండ్లేరు జలాశయంలోకి వెళ్లి గాలింపు చేపట్టారు. అయినా ఆచూకీ లభించలేదు. సాయంత్రం ఇళ్లకు తిరిగొల్లే సమయంలో అప్పనపల్లె వద్ద 19వ బ్లాక్ ఉప ప్రధాన కాల్వలో ఓ మృత దేహం ఉందని సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి వెళ్లారు. మృత దేహం సుధాకర్‌దే అని గుర్తించారు. కాల్వలో నుంచి మృత దేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు. కేసు విచారణ చేపట్టినట్లు మహానంది ఎస్ఐ తెలిపారు. గాలింపు చర్యల్లో శిరివెళ్ల సీఐ వంశీధర్, రుద్రవరం ఎస్ఐ వరప్రసాదు, ఏపీ ఎస్‌డీఆర్‌ఎఫ్ పోలీసులు ఉన్నారు.

గుర్తుతెలియని మరో మృత దేహం లభ్యం

గండ్లేరు రిజర్వాయరులో గుర్తు తెలియని మరో మృత దేహం బయట పడింది. సుధాకర్ ఆచూకీ కోసం మహానంది పోలీసులు రిజర్వాయరులో గాలిస్తుండగా ఓ మృత దేహం బయటపడింది. అయితే అది సుధాకర్‌ది కాదు. సుధాకర్ కంటే ఓ రోజు ముందే అక్టోబర్ 26న గాజులపల్లె-గిద్దలూరు రహదారిలోని వంతెనపై నుంచి తెలుగుగంగ ప్రధాన కాల్వలో ఓ వ్యక్తి పడిపోయినట్లు స్థానికులు తెలిపారు.

నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు

ఉయ్యాలవాడ : నేరాల నియంత్రణకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్లు రూరల్ సీఐ కంబగిరి రాముడు తెలిపారు. గురువారం రాత్రి మండల కేంద్రం ఉయ్యాలవాడ బస్టాండ్ ఆవరణలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ లైసెన్స్‌తోపాటు వాహనాలకు సంబంధించిన ధృవీకరణ పత్రాలు ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. చట్ట విరుద్ధంగా వాహనాలు నడిపితే జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. మట్కా, ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, గ్యాంబ్లింగ్, పేకాట ఆడుతుంటే పోలీసులకు తెలుపాలని, సమాచారం అందించిన వ్యక్తుల పేర్లను గోప్యంగా ఉంచుతామని సీఐ స్పష్టం చేశారు.

బహిరంగంగా మద్యం సేవిస్తే చర్యలు



పల్లెనిద్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఐ

దొర్నిపాడు: ఎక్కడబడితే అక్కడ బహిరంగంగా మద్యం సేవిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వెంకటేష్ హెచ్చరించారు. శుక్రవారం రాత్రి గుండుపాపల గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రంకెన్‌డ్రైవ్ చేస్తూ పట్టుబడితే జైలు శిక్ష తప్పదన్నారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా అపరిచితులు ఫోన్ చేసి ఆధార్ నంబర్, ఓటీపీ, ఏటీఎం పిన్ నంబర్ అడిగితే చెప్పవద్దని సూచించారు. ద్విచక్రవాహచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అలాగే ఆటోలలో పరిమితికి మించి కూలీలను తీసుకెళ్లొద్దని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వర్లు, మాజీ వీఆర్‌ఓ వెంకటేశ్వరరెడ్డి, నాయకులు కాశీవిశ్వనాథ్‌రెడ్డి, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ కోసం తప్పని నిరీక్షణ!



•చిత్రంలో కనిపిస్తున్న అంధురాలు ఆశాబీ. కోటకందుకూరు గ్రామంలో నివాసం ఉంటుంది. ఇంటికి వద్దకు వచ్చి పింఛన్ ఇవ్వక పోవడంతో స్థానిక సచివాలయం వద్దకు తల్లి సాయంతో వెళ్లి పింఛన్ తీసుకుంది. అంధురాలుకావడంతో కార్యాలయం వద్దకు వెళ్లడానికి ఎంతో ఇబ్బందులు పడినట్లు ఆవేదన వ్యక్తం చేశారు.



•చిత్రంలో కర్రచేతపట్టుకుని వెళ్తున్న వృద్ధుడు రసూల్. చాగలమర్రి మండలం ముత్యాలపాడు గ్రామ వాసి. పింఛన్ ఇంటి దగ్గర ఇవ్వక పోవడంతో మరోకరి సాయంతో కార్యాలయం చేరుకున్నాడు. అక్కడ కాసేపు నిరీక్షిస్తే తప్పా పింఛన్ నగదు ఇవ్వలేదని ఆవేదన చెందుతున్నాడు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పొద్దున్నే ఇంటి తలుపుతట్టి పింఛన్ సొమ్ము అందజేసిన వలంటీర్ల సేవలను లబ్ధిదారులు గుర్తు చేసుకుంటున్నారు.

- సచివాలయాలు, చెట్ల కింద, రచ్చబండల వద్ద నగదు పంపిణీ చేస్తున్న అధికారులు
- అవ్వాతాతలు, దివ్యాంగులకు తప్పని ఇబ్బందులు
- గత ప్రభుత్వంలో వలంటీర్లు అందజేసిన సేవలను గుర్తు చేసుకుంటున్న లబ్ధిదారులు



ఆళ్లగడ్డ: కోటకందుకూరులోని సచివాలయంలో పింఛన్‌దారుల నిరీక్షణ



చాగలమర్రి: శెట్టివీడులో రచ్చబండ వద్ద పింఛన్లు పంపిణీ చేస్తున్న అధికారులు

ఆళ్లగడ్డ: ఒకటో తారీఖు వచ్చిందంటే సామాజిక పింఛన్ లబ్ధిదారుల్లో వణుకు పుడుతోంది. ఎక్కడకి వెళ్లి పింఛన్ తీసుకోవాలనే ఆందోళన వారిని వేధిస్తుంది. అధికారులు మాత్రం తొలిరోజే 90శాతానికిపైగా పింఛన్లు పింపిణీ చేశామని గొప్పలు చెబుతున్నారే తప్పా వృద్ధులు, దివ్యాంగుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటే మిన్నగా ప్రజల వద్దకే పాలన సాగిస్తామన్న టీడీపీ కూటమి ప్రతినిధుల హామీలు నీటి మూటలుగా నిలిచిపోయాయి. ఇళ్ల వద్దనే పింఛన్ పంపిణీ ఉత్తి మాటలకే పరిమితమైంది. పింఛన్ పంపిణీని ఇళ్లవద్ద కాకుండా కార్యాలయాలు, చెట్లకింద, రచ్చబండల వద్ద అధికారులు సాగిస్తుండడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకించి వృద్ధులు, వికలాంగుల తిప్పలు వర్ణనాతీతం. పింఛన్ కోసం ఆయా ప్రాంతాల్లో పింఛన్ లబ్ధిదారులకు నిరీక్షణ తప్పడం లేదు.

92 శాతం పంపిణీ

తొలిరోజు 38,164 పింఛన్లకు గాను 35,349 మంది లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. అంటే 92.62 శాతం పింఛన్లను పంపిణీ పూర్తి చేసినట్లు అధికారులు గొప్పగా చెప్పుకుంటున్నారు. పింఛన్ నగదు తీసుకునేందుకు లబ్ధిదారులు పడిని తిప్పలు మాత్రం వీరికి పట్టడడం లేదని లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

21 నుంచి సాగునీటి సంఘాల ఎన్నికలు

శిరివెళ్ల: మండలంలో 21 నుంచి మూడు రోజుల పాటు సాగునీటి సంఘాల ఎన్నికలు జరగనున్నాయని తహసీల్దార్ పుష్పకుమారి తెలిపారు. 21వ తేదీన తెలుగు గంగ ఆయకట్టు కాల్వలు, 22న కేసీ కెనాల్ , 23న బోయలకుంట్ల, గంగవరం, చెన్నూరు, శిరివెళ్ల నాగుల చెరువులకు ఎన్నికలు జరగనున్నాయన్నారు. ఎన్నికలకు సంబంధించి ఆయా శాఖల అధికారులు ఓటర్ల జాబితాలను తయారు చేశారన్నారు.ఈ జాబితాలను తహసీల్దార్, ఎంపీడీఓ, గ్రామ పంచాయతీల వద్ద ప్రదర్శించడం జరిగిందని వివరించారు.

హెచ్‌ఐవీపై అవగాహన

శిరివెళ్ల: మహదేవపురం గ్రామ సచివాలయంలో శుక్రవారం హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమం జరిగింది. చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం జోనల్ సూపర్ వైజర్ మీరాంరెడ్డి మాట్లాడుతూ వలసకూలీలు, హమాలీలు, యువత వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కేవలం ఆసురక్షిత లైంగిక సంబంధాలుతో వ్యాధి వస్తుందన్నారు. ప్రభుత్వ వైద్య శాలలో వ్యాధి నిర్ధారణకు ఉచితంగా పరీక్షలు చేస్తారన్నారు.

ముగిసిన గ్రామ రెవెన్యూ సభలు

రుద్రవరం: మండలంలో రెవెన్యూ గ్రామ సభలు ముగిశాయి. చివరి రోజు శుక్రవారం వెలగలపల్లెలో అధికారులు గ్రామ సభ నిర్వహించారు. రైతులను నుంచి తహసీల్దారు మల్లికార్జునరావు వినతులు స్వీకరించారు.

కలిసి కట్టుగా పని చేస్తేనే అభివృద్ధి



డీఆర్‌ఓను సన్మానిస్తున్న కలెక్టర్

నంద్యాల(అర్బన్): అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి కట్టుగా పని చేస్తేనే జిల్లా అభివృద్ధి సాధ్యమని కలెక్టర్ రాజకుమారి అన్నారు. స్థానిక కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న డీఆర్‌ఓ పద్మజ, నంద్యాల, డోన్, ఆత్మకూరు ఆర్డీఓలు మల్లికార్జున్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, దాసులకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు జిల్లాకు వచ్చిన డీఆర్‌ఓ, ఆర్‌డీఓలు అంకిత భావంతో పని చేసి తక్కువ కాల వ్యవధిలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారని అభినందించారు. డీఆర్‌ఓ పోస్టును పద్మజ అన్ని శాఖలతో కో ఆర్డినేట్ చేసుకుంటూ పరిపాలన వ్యవహారాలు చక్కదిద్దారన్నారు. కార్యక్రమంలో జేసీ విష్ణుచరణ్, డీఆర్‌ఓ రామునాయక్, ఆర్‌డీఓ విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీపూజ



ప్రత్యేక అలంకరణలో శ్రీకాళికాంబా దేవి



సంజీవనగర్ రామాలయంలో ఉచిత సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

నంద్యాల (వ్యవసాయం): దీపావళిని పురస్కరించుకొని పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలో గురువారం శ్రీ భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో లక్ష్మీ పూజ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుల ఆధ్వర్యంలో అమ్మవారి మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. అనంతరం ఉచిత సామూహిక లక్ష్మీ సహస్రనామాస్తం అష్టోత్తరాన్ని నిర్వహించారు. మహా మంగళహారతిచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అదేవిధంగా కోటా వీధిలోని కోటా సుంకులా పరమేశ్వరి దేవి, శ్రీ కాళికాంబా చంద్రశేఖర్ స్వామి దేవస్థానంలో దీపావళి పండుగను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సూరయ్య, శ్రీనివాసులు, ఆరవీటి వాసు, పసుపులేటి నారాయణ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ క్రీడలు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక పద్మావతినగర్‌లో ఉన్న ఇండోర్ స్టేడియంలో ఈనెల 3, 4 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ స్కూల్‌గేమ్ ఫెడరేషన్ అండర్-17 బాలబాలికల రాష్ట్రస్థాయి క్రీడలు నిర్వహిస్తున్నట్లు నంద్యాల జిల్లా డీఈఓ జనార్దన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి శ్రీనాథ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 13 జిల్లాల నుంచి 160మంది క్రీడాకారులు, 50 మంది వ్యాయామ ఉపాధ్యాయులు, టెక్నికల్ సిబ్బంది పాల్గొంటారన్నారు. క్రీడాకారులకు భోజన వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో, మున్సిపల్ పాఠశాలలో వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వైభవంగా దాదా ఖలందర్ స్వామి ఉరుసు

చాగలమర్రి: మండల కేంద్రం చాగలమర్రిలోని రచ్చబండ వీధిలోని పాత బుగ్గ రాస్తాలో వెలసిన దాదాఖలందర్ స్వామి గంధం, ఉరుసు వేడుకలు రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. స్వామివారి గంధాన్ని ఫకీర్లు ప్రత్యేక విన్యాసాలతో ఊరేగించారు. మహిళా భక్తుల సమక్షంలో వెలుగుతున్న జ్యోతిని నోటితో మింగడం ఆశ్చర్యానికి గురిచేసింది. దాదాఖలందర్ స్వామితో పాటు భక్తులు మండుతున్న అగ్గిలో నడిచారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.